ప్రజాశక్తి

ఆదివారం 11 ఆగస్టు 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

బుద్ధదేవ్ భట్టాచార్య
ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి..

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

బుద్ధదేవ్ భట్టాచార్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య పిలుపునిచ్చారు. సిపిఎం పూర్వ పొలిట్‌బ్యూరో సభ్యులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్య మంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి కార్యక్ర మం శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్య దర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై.సిద్ధయ్య మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ చాలా నిరాడంబరంగా జీవించారని తెలిపారు. ప్రజలందరినీ కలుపుకుపోయే లక్షణం ఆయనలో ఉందన్నారు. రాజకీయంగా అనేక పదవులు చేపట్టారని వివరించారు. బెంగాల్ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా పదవులను చేపట్టి ప్రజలకు ఎనలేని సేవలు చేశారని తెలిపారు. సిపిఎంలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా, సెంట్రల్ కమిటీ సభ్యునిగా, పొలిట్‌బ్యూరో సభ్యునిగా బాధ్య తలు నిర్వహించి.. పార్టీ ▶ 2లో

జ్వరాల పంజా

- రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిట
- వాతావరణంలో మార్పుతో వైరల్ ఫీవర్ల విజృంభణ
- దోమల స్వైరవిహారంతో పెరుగుతున్న డెంగ్యూ కేసులు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జనం జ్వరాల బారిన పడుతున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతి ఊర్లోనూ జ్వరపీడితులున్నారు. విష జ్వరాలు, టైఫాయిడ్, డెంగ్యూ ఇలా అనేక రకాలుగా జనాన్ని పట్టిపీడిస్తున్నాయి. ముందస్తు చర్యలు కనిపించడం లేదు. వైద్యశాఖ మరింత అప్ర మత్తం కావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జ్వరాలతో పాటు జలుబు వంటి శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు, మూడు రోజులు ఆర్‌ఎంపీల వద్ద చూపించుకుంటున్నారు. తగ్గకపోతే పట్టణాలలో ఆసుపత్రులకు వస్తున్నారు.

ఇప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ రోజులుంటే ప్లేట్‌లెట్స్ పడిపోతాయనే భయం కూడా వెంటాడుతోంది. నాలుగు రోజులు జ్వరం ఉంటే శరీరంలో ఏదో ఒకరకమైన కణాలు తగ్గుతున్నాయని వైద్యులు తెల్చుతున్నారు. ఇప్పుడు అందరూ ఇదే ఆందోళనలో పడ్డారు. వాతావరణంలో మార్పులతో పాటు వర్షాలకు తాగునీటి జలాలూ కలుషితమయ్యాయి. తాగునీటి పథకాల ద్వారా అందించే నీటిని సక్రమంగా ఫిల్టరు చేయడం లేదు. కాలువల ద్వారా వచ్చే నీటిని ట్యాంకర్లకు ఎక్కించి ఇస్తున్నారు. చాలా చోట్ల నీరు సురక్షితంగా కనిపించడం లేదు. ఒంగోలు పట్టణంలో కుళాయిల ద్వారా ఇచ్చే నీళ్లే నల్లగా కనిపిస్తున్నాయి. ఫిల్టరు కావడం లేదు. ఇతర పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. నీటి సమస్య బాగా ఇబ్బందిగా మారిందంటు న్నారు. ఇక వాతావరణంలో ఈ సమయంలో ఎక్కువగా వ్యాధికారక వైరస్‌లు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వీటి ప్రభావం కూడా తీవ్రంగానే ఉంది. జలుబులు, దగ్గులు వంటివి వైరస్‌ల వల్లనే వస్తున్నాయి. ఏదేమైనా సీజనల్ వ్యాధులు చుట్టుముడు తున్నాయి. ఇక దోమల వల్ల డెంగ్యూ కేసులు పెరిగాయి. ఇప్పటికే 100కుపైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ అంటే హడలిపోతున్నారు. పదేళ్లుగా జిల్లాను డెంగ్యూ పట్టిపీడిస్తోంది. పగటిపూట దోమ కుడితే డెంగ్యూ వస్తోంది. దీని వల్ల ప్లేట్‌లెట్స్ పడిపోయి ప్రాణాలకే ముప్పు వస్తోంది. గత పదేళ్లలో వందల మంది చనిపోయారు. ఇవన్నీ వైద్యశాఖ రికార్డుల్లోనూ లేవు. ప్రైవేటు ఆసుపత్రులకే డెంగ్యూ కేసులన్నీ వస్తున్నాయి. ఏదేమైనా ఇప్పుడు వ్యాధుల ▶ 2లో



విద్యుత్ కాంతులతో యుటిఎఫ్ ఆఫీస్

డిసెంబర్‌లో యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు

రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు

▶ 8లో

స్వాతంత్రోద్యమ చరిత్ర పట్ల
పూర్తిస్థాయి అవగాహన అవసరం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రతి విద్యార్థీ స్వాతంత్రోద్యమ చరిత్ర పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. స్థానిక భట్టి ప్రోలు కేయస్కే బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు క్విట్ ఇం డియా ఉద్యమం స్ఫూర్తితో మహిళలపై జరుగుతున్న దాడులను, మత్తు పానీయాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ - ఐద్వా ఆధ్వర్యంలో సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా డి. రమా దేవి మాట్లాడుతూ స్వాతంత్రోద్య మంలో ఎంతోమంది యువకులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. బొంబాయిలో 1942 ఆగస్టు 8న గోవాలియా ట్యాంక్ మైదాన్‌లో చేసిన క్విట్ ఇండియా ప్రసంగంలో మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అని పిలుపునిచ్చా రన్నారు. ఈ ఉద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని బహిష్కరించడం, ప్రభు త్వ ప్రమేయం ఉన్న లావాదేవీలను తిరస్కరించడం వంటివి ఉన్నాయ న్నారు. బ్రిటీష్ ప్రభుత్వం పది వేల మంది నాయకులను అరెస్టు చేసి వారిని 1945 వరకు జైలులో ఉంచిం దన్నారు. 1945లో జైలులో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల విడుదల తో క్విట్ ఇండియా ఉద్యమం ముగిసిం దన్నారు. ఈ ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం ప్రకటించడం జరిగింద న్నారు. నేటి విద్యార్థులు స్వాతంత్ర స్ఫూర్తితో ప్రజా ఉద్యమాల్లో భాగస్వా ములు కావాలని ▶ 2లో

జ్వరాల పంజా

(మొదటిపేజీ తరువాయి)

కాలం జనం తీవ్రంగానే ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులు లేరు. జిల్లా కేంద్రంలో ఉండే రిమ్స్‌లోనే అత్యవసర విభాగాల్లోనూ వైద్యుల కొరత ఉంది. స్పెషలిస్టులు లేరు. దీంతో అనివార్యంగా ప్రైవేటు వైపే వెళ్లాల్సి వస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించిన ప్రభుత్వాసుపత్రుల్లో భవనాలు తప్ప వైద్యం కనిపించడం లేదు. ఆపదలో వైద్యం ఎండమావిగానే మారింది. నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉంది. కనిగిరిలో ప్రభుత్వాసుపత్రి నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేర్చారు. దాన్ని ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మరమ్మతులు చేయిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్‌ను బ్లడ్‌బ్యాంకుగా మార్చారు. అక్కడ ఎటువంటి ఆపరేషన్లు కూడా చేయడం లేదు. పైగా వంద పడకల ఆసుపత్రిని 50 పడకలకు తగ్గించారు. వైద్యం ఇలా దిగజారుతోంది. ఇక ఆరోగ్యశ్రీ కిందకు సాధారణ వ్యాధులు రావడం లేదు. దీంతో ఆసుపత్రులకు భారీగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. పరీక్షలు, మందులు, ఓపీలు ఇలా కనీసం ఒక్కొక్కరికి రెండు, మూడు వేలకు తక్కువ కావడం లేదు. ఇప్పుడు కనీసం రూ.1000 విలువైన పరీక్షలు చేస్తే తప్ప ఏ వ్యాధి అనేది తేల్చలేకపోతున్నారు వైద్యులు. పరీక్షల ఖర్చే ఇప్పుడు భారీగా పెరిగింది. మందుల ధరలూ భారీగా పెరిగాయి. సీనియర్ వైద్యులు ఈ స్థాయిలో పరీక్షలు రాసే వాళ్లు కాదు. మారిన వైద్యపరిస్థితులు కూడా సామాన్యులకు భారంగా మారాయి. ఏదేమైనా ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించి అన్ని సౌకర్యాలు కల్పించాలి. వైద్యం సామాన్యుడికి అక్కడే అందేలా చూడాలి.

స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పట్ల పూర్తిస్థాయి అవగాహన అవసరం

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు ఎక్కువగా మత్తు పదార్థాల వల్లే జరుగుతున్నాయని, ఇటీవల రాష్ట్రంలో కొన్ని ఘటనలు దీనికి ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పారు. మహిళలను ఒక విలాసవంతమైన వస్తువుగా చూపిస్తూ వారిని సమాజంలో అగౌరవపరుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను, యువతను పక్కదోవ పట్టించే మత్తు పదార్థాల నిర్మూలన కోసం, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిర్మూలించేందుకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేటి విద్యార్థులు, యువత పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఐద్వా నాయకురాలు టి సుభాషిణి, కెఎస్‌కే కళాశాల ఏవో శ్రీధర్, వ్యకాస జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతానికి కృషి చేశారని వివరించారు. చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి బుద్ధదేవ్ భట్టాచార్య అని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం ఇస్తామన్న పద్మభూషణ్ అవార్డును కూడా నమ్రతతో తిరస్కరించారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఆయన నిరాడంబర జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య మరణం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి, పార్టీ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. బెంగాల్ రాష్ట్రంలో తిరిగి ఉద్యమ నిర్మాణం జరిగే సమయంలో ఆయన మరణం తీరని లోటని తెలిపారు. 11 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి అక్కడ ప్రజలకు అనేక సేవలు చేశారని చెప్పారు. వ్యక్తులు కాదు, పార్టీనే ముఖ్యమని నిరూపించారని కొనియాడారు. ముందుగా బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి వై.సిద్ధయ్య పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారు బుద్ధదేవ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, సీనియర్ నాయకులు పెంట్యాల హనుమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు జి.రమేష్, కె.రమాదేవి, జి.శ్రీనివాసులు, బి.రఘురాం, వి.బాలకోటయ్య, టి.తిరుపతయ్య పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉద్యమాల వల్లే హక్కులు: యుటిఎఫ్

ప్రజాశక్తి-కొనకనమిట్ల

యుటిఎఫ్ స్వర్ణోత్సవ జండా ఆవిష్కరణ కార్యక్రమం యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై అధ్యక్షతన కొనకనమిట్ల మండలం లోని ఎంపిడిఓ కార్యాలయం దగ్గర శనివారం జరిగింది. యుటిఎఫ్ సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవంలో భాగంగా యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ, శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని సీనియర్ కామ్రేడ్ రిటైర్డ్ టీచర్ ఎ బాదుల్లా ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి రమణారెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘం చేసిన ఉద్యమాల వల్లే మనం అనేక రాయితీలను, హక్కులను, కౌన్సెలింగ్ విధానం సాధించుకున్నామని, అప్రెంటిషిప్ రద్దు చేయించుకున్నామని అన్నారు. మండల విద్యాశాఖఅధికారి బి నరసింహారావు, జిల్లా సహా అధ్యక్షులు అబ్దుల్‌హై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బి బుజ్జిబాబు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె సుబ్రహ్మణ్యాచారి, కొనకనమిట్ల మండల ప్రధాన కార్యదర్శి ఎస్ కామేశ్వరరావు, మండల సీనియర్ కామ్రేడ్ పి శ్రీనివాసులురెడ్డి, బి కృపారావు, కాసు తిరుపతిరెడ్డి, పి ఆంజనేయ చౌదరి, సిహెచ్ మల్లికార్జునరావు, కాకునూరి వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ సుబ్బారావు, ఖాసింసా, మునగ చెంచు రామారావు, చిన్నపురెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వడ్డిపాటి వెంకటేష్, కప్పల మాల్యాద్రి, పూసపాటి వెంకటేశ్వర్లు, మర్రిపూడి వెంకటరమణయ్య, పొదిలి వలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

13న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సంతనూతలపాడు: ఎస్సీ వర్గీకరణ సాధనకు విశిష్ట కృషి చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ ఈ నెల 13న ఢిల్లీ నుంచి హైదరాబాద్ వస్తున్న సందర్భంగా చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు టి ఆనంద మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక క్రిస్టియన్‌పాలెంలో ఎమ్మార్పీ ఎస్ వర్గీయులతో ఆనంద మాదిగ శనివారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ అధినేత మందా కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం తీవ్ర పోరాటం చేశారని అన్నారు. ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకు హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చిందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. ప్రధాన నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అను కూలంగా ఉన్నారన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, ఎంఈఎఫ్, వీహెచ్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు 13న జరిగే చలో హైదరాబాదును జయప్రదం చేయాలని టి ఆనంద్ మాదిగ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు టి కోటేశ్వరరావు, ఎమ్మార్పీస్ నాయకులు అట్లూరి అశోక్, పాలపర్తి రవికుమార్, అట్లూరి భిక్షాలు, వంకాయలపాటి కోటేశ్వరరావు, ఏ నరసింహారావు, ఏ కిరణ్, బి కమలహాసన్ పి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకే ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సెలవు రోజు కూడా విధులకు ఎందుకులే అనుకున్నారో ఏమో మూడు రోజులు జరగాల్సిన శిక్షణను అధికారులు రెండు రోజులకే ముగించేశారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితరాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ వారు మూడు రోజుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ శిక్షణ నిర్వహించాల్సి ఉంది. అయితే మూడో రోజు రెండో శనివారం కావడం, సెలవు దినం కావడంతో మూడు రోజుల శిక్షణను అధికారులు రెండు రోజుల శిక్షణతోనే సరిపెట్టేశారు.

దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

మంత్రి లోకేష్‌ను కలిసిన మస్తానయ్య

ప్రజాశక్తి-మార్కాపురం

దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం ఇవ్వాలని టి.యన్.టి.యు.సి. ఆర్గనైజింగ్ సెక్రెటరీ దూదేకుల మస్తానయ్య మంత్రి లోకేష్‌కు విన్నవించుకున్నారు. మంత్రి లోకేష్ నివాసంలో ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అనుచరుడిగా 25 సంవత్సరాల నుండి పార్టీకి సేవ చేస్తున్నానని, అత్యంత వెనుకబడిన ప్రకాశం జిల్లాలో అధికంగా ఉన్న దూదేకుల నూర్ బాషా కులస్తులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. పశ్చిమ ప్రాంతంగా పిలవబడే మార్కాపురం డివిజన్ ప్రాంతంలో, ప్రకాశం జిల్లాలో దూదేకుల నూర్ భాషా కులస్తులు అధికంగా ఉన్నారని అందుకు తగిన గౌరవంగా తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఆయన తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి పార్టీ తగిన గౌరవం ఇస్తుందని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ఇద్దరు పదో తరగతి విద్యార్థుల మృతి



చరణ్ (ఫైల్‌ఫోటో)



గౌతమ్ (ఫైల్‌ఫోటో)



మృతదేహాలను బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

ప్రజాశక్తి - పామూరు

ఈత సరదా ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. శనివారం సెలవు కావడంతో ఇద్దరు పదో తరగతి విద్యార్థులు సరదాగా ఈత కోసం వెళ్లి మృతి చెందిన సంఘటన పామూరు పట్టణం సమీపంలో జరిగింది. పసుపులేటి చరన్ (17), పసుపులేటి గౌతమ్ (18) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. డివి పాలెం నుండి వెంకటాపురం వెళ్లే దారిలో హైవే రోడ్డు కోసం గుంతలు తీసి ఉండగా ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల నిండా చేరాయి. శనివారం విద్యార్థులు ఈత కోసం వెళ్లి లోతు అంచనా వేయలేక ఊపిరాడక మృతి చెందారు. పామూరు పట్టణానికి చెందిన పసుపులేటి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు గౌతమ్ కాగా ఒక్కగానొక్క కుమారుడు మృతితో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. డివి పాలెంలో నివాసం ఉంటున్న పసుపులేటి నారాయణకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు చరణ్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సీఐ శ్రీరాం నాయక్, ఎస్సై సైదుబాబు ప్రమాద స్థలం వద్దకు చేరుకొని గజీత ఈతగాళ్లతో విద్యార్థుల మృతదేహాలను బయటకు తీశారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కనిగిరికి తరలిస్తున్నట్లు ఎస్ఐ సైదులు బాబు తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

భర్తను హత్య చేయించి.. ఆత్మహత్యగా చిత్రీకరణ

భార్య, ప్రియుడు, నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్‌పి దామోదర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఓ భార్య ప్రియుడు, కిరాయి హంతకులతో భర్తను హత్య చేయించి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నంలో పోలీసులకు అడ్డంగా బుక్కాయ్యారు. పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి స్వల్ప వ్యవధిలోనే భార్య, అతని ప్రియుడు, హత్యలో పాల్గొన్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ వెల్లడించారు. చల్లా వెంకట నరేంద్రబాబు (40) ఒంగోలు కేంద్ర ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పొదిలి పట్టణం పిఎన్ఆర్ కాలనీ 3వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. నిందితుడు కొండా శశికుమార్ సంవత్సరం క్రితం తన కుటుంబంతో వీరి ఇంటికి ఎదురు ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో శశికుమార్, చల్లా లక్ష్మి ప్రియకి పరిచయం ఏర్పడి ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడటంతో కొండ శశికుమార్ తరుచుగా లక్ష్మీప్రియ ఇంటికి వెళుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో వారు శారీరకంగా కలుసుకుంటున్నారు. తరువాత కొద్ది రోజులకు లక్ష్మీప్రియ ప్రవర్తనలో మార్పు రావడం గమనించిన నరేంద్రబాబు వారిద్దరినీ మందలించి భార్యకు ఫోన్ ఇవ్వకుండా దూరం పెట్టాడు. దీంతో ఇద్దరికీ మాట్లాడుకోవటం ఇబ్బందిగా ఉండటంతో శశికుమార్ లక్ష్మీప్రియకు కొత్త ఫోన్ కొనిచ్చాడు. ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకుంటూ, సంబంధాన్ని కొనసాగిస్తుండటంతో నరేంద్రబాబు తన భార్యను గట్టిగా మందలించాడు. అది భరించలేని లక్ష్మీప్రియ, శశికుమార్‌లు మృతుడిని ఎలాగైనా చంపి వారి అక్రమ సంబంధానికి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారన్నారు. లక్ష్మి ప్రియ ఇంటిలో బంగారు నగలను శశికుమార్‌కు ఇచ్చి వాటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో కిరాయి మనుషులతో మృతుడిని చంపించాలని పథకం వేశారు. ఈనెల 2న శశికుమార్ నెల్లూరు వెళ్లి నలుగురు వ్యక్తులను రూ. 2 లక్షల కిరాయికి మాట్లాడుకొని వారిని అదే రోజు రాత్రి పొదిలికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి ఇంటిలో నిద్రపోతున్న నరేంద్రబాబు గొంతుకి తాడు బిగించి గట్టిగా లాగి ఉపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. దీనిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతుడిని వంటగదిలో తాడుతో వేలాడదీశారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదిలి ఎస్సై కోటయ్య అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పొదిలి సిఐ మల్లికార్జున రావు, పొదిలి ఎస్సై కోటయ్య సిబ్బంది నేతృత్వంలో ప్రత్యేక టీమ్‌ను నియమించి అన్ని కోణాలలో కేసును దర్యాప్తు చేసి హత్య కేసులో నిందితులను అరెస్టు చేశారు. హత్య కేసులో నిందితులు మృతుడి భార్య చల్లా లక్ష్మీప్రియ, ఆమె ప్రియుడు కొండా శశికుమార్, హత్యలో పాల్గొన్న నెల్లూరుకు చెందిన షేక్ నహీద్, షేక్ ఫజ్లు అలియాస్ షాహుల్, సయ్యద్ సిద్దిక్, షేక్ ముబారక్‌లను ఈనెల 9న కాటూరివారిపాలెం గ్రామ శివారులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును స్వల్ప వ్యవధిలోనే ఛేదించడంలో ప్రతిభ కనపరచిన పొదిలి సిఐ మల్లికార్జున రావు, పొదిలి ఎస్సై జి.కోటయ్య, తర్లుపాడు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పొదిలి కానిస్టేబుల్‌లు కోటేశ్వ రరావు, గౌతమ్ కుమార్, రమేష్ బాబు, వీరరాజును జిల్లా ఎస్‌పి దామోదర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



పోలీసులు అరెస్టు చేసిన కూలీలు

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ సమీపంలోని తర్లుపాడు రోడ్డులో గల ఓ రైస్ మిల్లులో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తున్న పదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. రైస్ మిల్లులో గుప్తనిధులు ఉన్నాయని ఎవరో చెప్పిన మాటలను మిల్లు యాజమాన్యం నమ్మి ఎలాగైనా పురాతన కాలం నాటి నిధులను దక్కించుకోవాలని ఆశతో కూలీలతో తవ్వకం పనులను శనివారం ప్రారంభించారు. రైస్ మిల్లు అంతటా 15 నుంచి 20 అడుగుల లోతున గుంతలు తీయించారు. ఇంతలో సమాచారం పోలీసులకు చేరింది. మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్ పది మంది కూలీలను, రైస్‌మిల్లు యజమానులను అదుపులోకి తీసుకున్నారు. అక్కడ ఏమైనా దొరికాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

బీటెక్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బిటెక్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలిసిన వివరాల ప్రకారం.. బేస్తవారిపేట మండలం గంటాపురంకు చెందిన చప్పిడి రాజేంద్రప్రసాద్, అరుణ కుమారి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రాజేంద్ర ప్రసాద్ విద్యుత్ వైరింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. 2019 సంవత్సరంలో బేస్తవారిపేట నుంచి కొప్పోలు రోడ్డులోని రాజీవ్ గృహకల్ప 2వ లైన్‌లో నివాసం ఉంటూ పిల్లలను చదివిస్తున్నారు. ఈయన పెద్ద కుమార్తె ప్రియ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. సంతనూతలపాడు మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన మేడికొండ సంజన పరిచయం కావడంతో చప్పిడి ప్రియ తన స్నేహితురాలు సంజనతో కలిసి తక్కెలపాడు గ్రామానికి వస్తూపోతూ ఉండేది. ఈ క్రమంలో మేడికొండ సంజన స్నేహితుడైన దాసరి కళ్యాణ్‌తో ప్రియకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారి ఇరువురు కలసి 2023వ సంవత్సరం తక్కెళ్ళపాడు గ్రామంలోని ఓ చర్చిలో వివాహం చేసుకున్నట్లు సమాచారం. దాసరి కళ్యాణ్ పెయింట్ పని చేసుకుంటే జీవిస్తుంటాడు. ప్రియకు చదువు సంబంధించి ఆర్థిక సహాయం చేస్తూ ఆమెను చదివిస్తున్నాడు. సంవత్సరం నుంచి ఇద్దరు కలిసి సహజీవనం చేస్తున్నారు. మూడు నెలల క్రితం సంతనూతలపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయగా ఆమె గర్భవతి అని తేలింది. అప్పటినుంచి ఇద్దరు సఖ్యతగా జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ప్రియ బలహీనంగా ఉండటంతో నూతలపాడు హాస్పిటల్‌కి తీసుకెళ్లగా సమయం దాటిపోయిందని ఒంగోలు తీసుకెళ్ళాలని వైద్య సిబ్బంది సూచించారు. దీంతో ఆమె భర్త దాసరి కళ్యాణ్ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ చేర్చారు. ఆమెకు రక్తం తక్కువగా ఉండటం, ఫిట్స్ రావటంతో రిమ్స్ వైద్య సిబ్బంది వైద్యం అందిస్తుండగా రాత్రి సమయంలో ప్రియ మృతి చెందింది. మృతురాలి తల్లి వాంగ్మూలంతో ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పామూరు

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఇనిమెళ్ల సమీపంలో కంకర క్వారీ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఇనిమెళ్ల సమీపంలోని కంకర క్వారీ వద్ద చెట్టుకి ఉరివేసుకొని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సైదుబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడు మచ్చా మాలకొండయ్య (65) నెల్లూరు జిల్లా, లింగసముద్రం, వి.ఆర్.కోట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు అయిన సంఘటన మండలంలోని మిట్టపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పెరిదేపి గ్రామానికి చెందిన పుసపాటి వీరకుమార్ అనే వ్యక్తి ప్రైవేటుగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తుంటాడు. శనివారం మిట్టపాలెం గ్రామానికి చెందిన ఒక ఇంటికి విద్యుత్ వైరు కనెక్షన్ ఇవ్వటానికి విద్యుత్ స్తంభం ఎక్కగా విద్యుత్ షాక్ తగిలి స్తంభం నుంచి కింద పడ్డాడు. షాక్ తగలడంతో వీరకుమార్‌కు కుడిచెయ్యి కాలింది. ఎడమచేతి వేళ్లు రెండు బాగా దెబ్బతిన్నాయి. క్రింద పడడంతో నడుములు కులబడ్డాయని స్థానికులు తెలిపారు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా క్షతగాత్రుడుని మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



పరిశీలిస్తున్న క్లూస్ టీం బృందం

పొదిలిలో భారీ చోరీ

రూ.1.30 లక్షల నగదు, రూ.5 లక్షల బంగారం అపహరణ

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో భారీ చోరీ జరిగింది. స్థానిక విశ్వనాథపురం జూనియర్ కళాశాల రోడ్డులోని ఒక కిరాణా దుకాణం వెనక తలుపులు పగల గొట్టి దుకాణంలో ఉన్న రూ.1.30 లక్షల నగదు, మూడున్నర సవర్ల బంగారం దోచుకెళ్లినట్లు బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని దుండగులు ఇంటికి వెనుక వైపు నుండి ప్రవేశించి ఈ దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కోటయ్య కేసు నమోదుచేసి క్లూస్ టీంను రప్పించారు. ఈ బృందం ఇంటిని అనువణువు పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన బంగారం విలువ సుమారు ఐదు లక్షలు ఉంటుందని యజమాని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి -కొనకనమిట్ల

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వద్దిమడుగు గ్రామానికి చెందిన బూదాల నాగరాజు 25 శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం సాయంత్రం కొనకనమిట్లలో సరుకులు తీసుకొని స్వగ్రామైన వద్దిమడుగుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురాళ్ళపాడు కొత్తఎస్సీ కాలనీ సమీపంలో వెనుకనుండి గుర్తు తెలివాహనం ఢీకొట్టిన సంఘటనలో నాగరాజుకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి నాగరాజు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య హైమా ఉంది. సర్పంచ్ పిచ్చయ్య, ఎంపిటిసి చక్కర వెలుగొండయ్య, మాజీ సర్పంచ్ బూదాల భాగ్యమ్మ, ఉప సర్పంచ్ యూతామ్, విఆర్ఓ బి.కుమార్‌లు మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.


వెంకయ్య నాయుడుకు స్వాగతం పలుకుతున్న కొండయ్య

వెంకయ్యకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - చీరాల

భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు చీరాల రైల్వే స్టేషన్‌లో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య శనివారం ఘన స్వాగతం పలికారు. కారంచేడులో జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహ ఆవిష్కరణకు వెంకయ్య నాయుడు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన చీరాల రైల్వే స్టేషన్‌కు చేరుకోవటంతో ఎంఎల్‌ఎ కొండయ్య, బిజెపి నాయకులు, వెంకయ్య నాయుడు అభిమానులు పూలతో ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.

ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - వేటపాలెం


ఎస్‌ఐ ఎం వెంకటేశ్వర్లు

నూతన ఎస్‌ఐగా ఎం వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడు తానన్నారు. చట్ట విరుద్ధంగా కార్యకలా పాలు నిర్వహించే వారి సమాచారం తనకు అందించాలని కోరారు. సమాచారం అందించినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. చీరాల వన్ టౌన్ ఎస్‌ఐగా విధు లు నిర్వహిస్తూ బదిలీపై వచ్చినట్లు తెలిపారు. విధినిర్వ హణలో సిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిఐటియు కార్యకర్తలు

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పర్చూరు

కేరళ వరద బాధితుల కోసం సీఐటియు నాయకులు శనివారం విరాళాలు సేకరించారు. ఇటీవల కేరళలోని వాయనాడు ప్రాంతంలో వరదలు వచ్చి కొండచరియలు విరిగి పడటంతో గ్రామంలో 400పై చిలుకు ప్రజలు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని దుఃఖంలో ముంచేసింది. బాధితులను ఆదుకోవటానికి అనేక మంది సినీనటులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలను అదుకోవటానికి ప్రజా సంఘాల నాయకులు ముందుకు వచ్చారు. అన్ని దుకాణ యజమానుల వద్ద విరాళాలు సేకరించి బాధితులకు పంపనున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. కేరళ వరద విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర ప్రజలను ఆదుకోవాలని కోరారు. భౌగోళికంగా కేరళ వాతావరణం ప్రకృతి విపత్తులకు కారణమైనట్లు పేర్కొన్నారు. ప్రజలు మానవతా దృక్పథంతో కేరళ వరద బాధిత ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు.

ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవం


అద్దంకిలో జెండా ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు



కర్లపాలెంలో జెండాను ఆవిష్కరిస్తున్న శేషవర్మరాజు

ప్రజాశక్తి - అద్దంకి

యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జె బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చక్రాయపాలెం జడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం కెవి శ్రీనివాసరావు యుటిఎఫ్ జండా ఆవిష్కరించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు కనపర్తి మాట్లాడారు. యుటిఎఫ్ ఏర్పడిన తర్వాతనే విద్యా రంగంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరికిందని తెలిపారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మందికిపైగా ఉపాధ్యాయుల సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం యుటిఎఫ్ అని అన్నారు. అప్రెంటిస్ విధానం రద్దు, సిపిఎస్ రద్దు వంటి పోరాటాల్లో యుటిఎఫ్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని తెలిపారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఈ రామారావు మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. సంఘ గౌరవ అధ్యక్షులు వినుకొండ సుధాకర్ మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యా రంగంలో ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా వ్యతిరేకంగా ఉన్నప్పుడు వాటిని పరిష్కరించుకోవడంలో ముందున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దామ రామాంజనేయులు, డివి రత్నం, బి చంద్రశేఖర్, సాంబశివరావు, మస్తాన్‌వలి, పి కృష్ణారావు, శ్రీధర్, కెకె, కోటేశ్వరరావు, దేవరాజ్, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కర్లపాలెం : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందంజలో ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయులు వి శేషవర్మరాజు అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు బివి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా శేషవర్మరాజు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రతినిధులు సిహెచ్ ప్రభాకర్, ఈ పోలీసురావు, సిహెచ్ అజయ్ కుమార్, బాబుజి, డేవిడ్, కె విమలమ్మ, ఎ శ్రీనివాసరెడ్డి, డి ఏసుదాసు, సతీష్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్థానిక యుటిఎఫ్ భవన్ ప్రాంగణంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, సూరేపల్లి పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎం ఆలీ, వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయులు కె శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ నినాదంతో యుటిఎఫ్ సమాజ నిర్మాణానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అభివర్ణించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమం యుటిఎఫ్‌కు రెండు కళ్ళు వంటివని అన్నారు. సమ సమాజ నిర్మాణానికి, రేపటి పౌరులను తీర్చిదిద్దటమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సభకు హాజరైన సభ్యులు యుటిఎఫ్ ఉద్యమ పందా, దాని ఎజెండా చిరస్థాయిగా ఉండాలని పిడికిలి బిగించి నినాదాలు చేశారు.


భట్టిప్రోలులో యుటిఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

అట్టహాసంగా కుప్పుస్వామి చౌదరి విగ్రహ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కారంచేడు


కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు

ప్రముఖ సంఘ సేవకులు, విద్యా దాత, ఉమ్మడి మద్రాసు శాసన మండలి సభ్యులు జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి విగ్రహావిష్కరణ గ్రామంలో శనివారం నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, ఎంపీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందరేశ్వరి, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎంపి కామినేని శ్రీనివాసరావు విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ దాతృత్వం, మానవత్వం, విద్యాదాత, పాలనా దక్షిత కలిపితే జాగర్లమూడి కుప్పు స్వామి చౌదరి అని అన్నారు. జాగర్లమూడి కుప్పు స్వామి చౌదరి కారంచేడు ప్రాంతంలోనే కాక అనేక ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన జీవితాన్ని, ఆయన చేసిన సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కుప్పు స్వామి చౌదరి చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైన ఉన్నదని పురందరేశ్వరి అన్నారు. కారంచేడు ప్రాంతంలోనే కాక వివిధ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కుప్పు స్వామి చౌదరి సేవలు చేశారని అన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో శాసన మండలి సభ్యునిగా, గుంటూరు జిల్లా బోర్డు ప్రెసిడెంట్ పని చేశారని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శంగా ఉంటుందని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. కార్యక్రమంలో కారంచేడు సర్పంచ్ బాలిగ శివపార్వతి, కుప్పు స్వామి చౌదరి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువే రేపటి భవిష్యత్తుకు పెట్టుబడి

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతాం
- వలపర్ల, మార్టూరు జెడ్‌పి పాఠశాలల్లో సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఎంఎల్‌ఎ ఏలూరు సాంబశివరావు

ఉన్నత చదువులే విద్యార్థుల రేపటి భవిష్యత్తుకు పెట్టుబడని ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మండలంలోని వలపర్ల, మార్టూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లోని వంద మంది విద్యార్థులకు ఏకం యూఎస్‌ఎ, ఎఫర్ట్, పిజిఎస్‌ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. చదువు విజ్ఞానాన్ని, తెలివితేటలను పెంచుతుందన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు తమ వంతు కర్తవ్యంగా మంచి సంకల్పంతో సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేలా దూర ప్రాంత విద్యార్థులకు సైకిల్ అందించేందుకు ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను అభినందించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా, కార్పొరేట్ విద్యను అందించేందుకు మంత్రి లోకేష్ ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఏమి ఆశించకుండా నిస్వార్థ సేవ భావంతో పనిచేసిన సంస్థల ప్రతినిధులను అభినందించారు. తన చిన్నతనంలో అనేకమంది విద్యార్థులు దూర ప్రాంతం వెళ్లేందుకు సైకిల్ కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితి లేక చదువులు మానేశారని గుర్తు చేశారు. తనకు తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి సెకండ్ హ్యాండ్ సైకిల్ కొని ఇచ్చారని, తాను 7వ తరగతి కోనంకి నుంచి వలపర్ల హైస్కూల్‌కు వచ్చి చదువుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అడుగులు వేయాలన్నారు. తొలుత ఎన్‌సిసి విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏకం యూఎస్‌ఏ ఆర్గనైజర్ శుద్ధమాల అర్చన కుమారి, ఎఫర్ట్ మోహనరావు, డాక్టర్ సుధాకర్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు?

కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, షేక్ సైదా

చేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, షేక్ సైదా ప్రశ్నించారు. శనివారం స్థానిక దర్శి రోడ్డులోని ఎస్‌వి గార్డెన్స్‌లో మీడియా సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారం లోకి వచ్చేటందుకు సూపర్ సిక్స్ పథకాలు ప్రధాన కారణమని అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 2 నెలలు కావచ్చిందని, ఈ 6 పథకాలలో ఒక్క సామాజిక పథకం మాత్రమే అమలు అయిందని, మిగతా 5 పథకాలు అమలు కాలేదన్నారు. అవి 1.నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, 2.తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000, 3. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా 20,000 ఆర్థిక సాయం 4.ప్రతి మహిళకు నెలకు రూ.1500 (19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు) ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 5.బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్


సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి, సైదా

పథకాలు అమలు కాలేదన్నారు. మీడియా సమావేశంలో జిల్లా కిసాన్ సెల్ నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బాబు, గోరంట్ల కోటేశ్వరరావు, ముల్లా జిలాని, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహనాబాను, షేక్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ నేతలు శ్రీయుతులు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం అమరావతి నుంచి పోరుమామిళ్ల వెళ్తూ మార్గమధ్యంలోని బేస్తవారిపేటలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలకల వెంకటేశ్వరరెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలు ప్రవేశపెట్టారని, ఆ పథకాల్లో ప్రధానంగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద సంవత్సరానికి 20,000 రూపాయలు అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ఇప్పటికీ నెరవేర్చకపో వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ యేడాది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తారా లేదా అనేది అనుమానంగా ఉందని, కావున ఆ పథకాన్ని వెంటనే అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలకల వెంకటేశ్వరరెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చెట్టు ఆయువును నిలిపారు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

చెట్లు మనిషి ఆయువును కాపాడేందుకు ఆక్సిజన్‌ను ఇచ్చి తోడ్పాటునిస్తాయి. అలాంటి చెట్లను మనం నిర్ధాక్షిణ్యంగా నరికేస్తున్నాం. ఒంగోలుకు చెందిన వృధ, సుధ సేవా సంస్థ సభ్యులు 200 సంవత్సరాల నాటి ఒక రావిచెట్టు ప్రాణాలను కాపాడారు. స్థానిక కర్నూలు రోడ్డులోని చుండూరు పెట్రోల్ బంకు పక్కన ఖాళీ స్థలంలో ఉన్న ఒక భారీ రావిచెట్టును అక్కడ నుంచి తొలగించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న వృధ, సుధ సేవా సంస్థ సభ్యులు శనివారం అక్కడికి చేరుకొని స్థల యజమానులతో మాట్లాడారు. ఆ చెట్టును అక్కడ నుంచి వేరే చోటుకు తీసుకువెళ్లి ప్రతిష్ట చేస్తామని, ఆ చెట్టు బతికి పదిమందికి నీడనిచ్చి, ఆక్సిజన్ ఇస్తుందని స్థల యజమానుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఇందుకు స్థల యజమాని బూచేపల్లి నాగలక్ష్మి అంగీకరించారు. దీంతో సేవా సంస్థ సభ్యులు హైదరాబాద్ నుంచి వచ్చిన భారీ క్రేన్ సాయంతో ఆ రావి చెట్టును అక్కడ నుంచి వేర్లతో సహా పెకిలించి చీమకుర్తిలోని ఓ


చెట్టు తరలింపు పనులు చేస్తున్న దృశ్యం

స్థలంలో మరలా ఆ చెట్టును పునప్రతిష్ఠించారు. రావిచెట్టుకు పునర్జన్మనిచ్చారు. ఈ కార్యక్రమంలో వృధ, సుధ సేవా సంస్థ సభ్యులు అశోక్, కిషోర్, శ్రేయస్ మూర్తి, అజయ్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు. ఎవరైనా చెట్లను తొలగించాల్సివస్తే తమకు తెలియజేయాలని, ఆచెట్లను కాపాడేందుకు తమవంతు సహకారం అందిస్తామని సేవా సంస్థ సభ్యులు తెలిపారు.

జిమ్యాట్‌లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-పొదిలి

జిమ్యాట్ (గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ టెస్ట్)లో స్థానిక బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, శ్రీమతి విజయలక్ష్మి దంపతుల ఏకైక కుమార్తె, బిట్స్ విద్యా సంస్థల యంగ్ డైరెక్టర్ బెల్లంకొండ సాహితీ రాయల్ ఇటీవల నిర్వహించిన జిమ్యాంట్ పరీక్షలో 800 మార్కులకు గాను అత్యధికంగా 760 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను చాటారు. అత్యధిక మార్కులు సాధించిన బెల్లంకొండ సాహితీ రాయల్‌కు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్ ఫర్డ్, హార్వర్డ్, పెన్సిల్వేనియా, కేంబ్రిడ్జ్, యూనివర్సిటీలలో, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్టాన్ ఫోర్డ్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లలో, జాతీయ స్థాయిలో ఇండియన్ ఇనిస్టుట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అహ్మదాబాద్, లక్నో, కలకొత్తా, బెంగళూరులో, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పంజాబ్, హైదరాబాద్‌లలో ఎక్కడ కోరుకున్నా సీటు లభించే అవకాశాలు లభించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అత్యధిక మార్కులు సాధించిన సాహితీరాయల్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట


విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపి మాగుంట

శ్రీనివాసరెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, బిట్స్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నారపుశెట్టి నాయుడు, డైరెక్టర్ మద్దుల శ్రీనివాసులు, బిఇడి కాలేజీ ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసులు, పొదిలి మాజీ ఎంపిటిసి డాక్టర్ సయ్యద్ ఇమాంసా, బిట్స్ కాలేజీ ఉపన్యాసకులు ఝాన్సీ ప్రియా నాయుడు, అబ్దుల్లా, నేలటూరి డిబ్బారెడ్డి, భార్గవ నాయుడు, మద్దుల లక్ష్మీకుమారి, హామీద, కల్లూరి రవికుమార్ రెడ్డి, శివప్రసాద రాజు, సుబ్బారావు, వీరిశెట్టి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది తదితరులు సాహితీ రాయల్‌ను అభినందించారు.

వివాహ వేడుకలో మంత్రి డోలా

ప్రజాశక్తి-దర్శి

తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్‌పిటిసి రమాదేవి కుమార్తె రచనారెడ్డి, సాయి ఫణీంద్రారెడ్డిల వివాహం దర్శి పిటిఎస్ కళ్యాణ మండపంలో శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మంత్రి డోల వీరాంజనేయ స్వామితోపాటు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, కనకమేడల రవీంద్ర, శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, నక్క ఆనందబాబు, ధూళిపాల నరేంద్రచౌదరి, జ్యోతుల నెహ్రూ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, దర్శి టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, టిడిపి నాయకులు, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్‌పిటిసిలతోపాటు అభిమానులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నాగులప్పలపాడు

భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టరు బాబా సాహెబ్ అంబేద్కర్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రమైన నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన 28 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, అంబేద్కర్ మనవడు యశ్వంత్ అంబేద్కర్, మాజీ కలెక్టరు జిఎస్‌ఆర్‌కెఆర్ విజయకుమార్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన అభ్యుదయ అడుగుజాడల్లో అందరూ నడచి చైతన్యవంతులు కావాలని, దానికి ముఖ్య ఆయుధం విద్యనే అని పేర్కొన్నారు. అంబేద్కర్ అందరివాడని కొనియాడారు. అంబేద్కర్ భారీ విగ్రహాన్ని నాగులుప్పలపాడు సెంటరులో ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. విగ్రహాలు పెట్టడం కాదు.. ఆయన చూపిన బాటలో పయనించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలడగు విజేంద్ర, ఎస్‌సి కమిషనర్ విక్టర్ ప్రసాదు, కమిటీ నిర్వాహకులు గుంపుల భూపతిరావు, పీకా రమేష్, గుంపుల సుబ్బారావు, దోనెంపూడి రవీంద్రబాబు, సుబ్బరాయుడు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

వివాహ వేడుకలో ఎంపి మాగుంట

ప్రజాశక్తి-దర్శి

దర్శి మాజీ వైస్ ఎంపీపీ మారం శ్రీనివాసరెడ్డి, సుశీల కుమారుడు పిచ్చిరెడ్డి, అఖిల వివాహ వేడుక శుక్రవారం రాత్రి బొట్టు శ్రీనివాసరెడ్డి వెంచర్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో పాటు దర్శి టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్, కడియాల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావుతో పాటు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితోపాటు దరిశి ప్రముఖులు, నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దృశ్యం

అంబేద్కర్ విగ్రహం వద్ద విధ్వంసానికి పాల్పడటం హేయమైన చర్య: బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

విజయవాడ నగరంలోని నడిబొడ్డున భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విధ్వంసానికి పాల్పడటం హేయమైన చర్య అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం దర్శిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డితో పాటు వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలేసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిపై కక్షతో స్మృతి వనం వద్ద విధ్వంసానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మాణాలకు వారి పేరు పెట్టుకోలేదా అని ఆయన ప్రశ్నించారు. వైసిపి పేదలు, దళితులు, మైనార్టీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిసిలు రత్నంరాజు, నుసుం నాగిరెడ్డి, ఎంపీపీలు గొల్లపాటి సుధారాణి, అచ్చయ్య, సుంకర సునీత, బ్రహ్మ నందరెడ్డి, మాజీ ఎంపీపీలు దేవదానం, పోశం మధు సూదన్‌రెడ్డి, గొల్లపాటి మోషే, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డి, నాయకులు కుమితం అంజిరెడ్డి, కెవి రెడ్డి, సద్ది పుల్లారెడ్డి, డగ్లస్ దేవప్రసాద్, కొడవటి జాను పాల్గొన్నారు.

గృహ ప్రవేశానికి 'దద్దాల' హాజరు

ప్రజాశక్తి-పామూరు

పామూరు మండలం తిరగలదిన్నె గ్రామ సర్పంచ్ పిన్నిక రత్తయ్య నూతన గృహ ప్రవేశం శనివారం కార్యక్రమానికి కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పామూరు మండలం జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య ఎఎంసి వైస్ చైర్మన్ చాంద్‌బాషా, మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చేనికల శ్రీనివాసరావు, కనిగిరి మండలం జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వెలిగండ్ల మండలం జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం ఏడుకొండలు, రేగలగడ్డ నాగరాజు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కదిరి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సిఎస్ పురం

కదిరి బాబురావు విద్యాసంస్థల వ్యవస్థాపకులు, కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన కళాశాలల సిబ్బంది, అభిమానులు కేక్ కట్ చేసి కదిరి బాబురావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కదిరి అభిమానులు, అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు అందజేత

ప్రజాశక్తి-దర్శి

దర్శి విచ్చేసిన హైకోర్టు పిపి లక్ష్మి నారాయణ, హెూం జిపి కృష్ణారెడ్డి, ఎంఎల్‌సి అశోక్‌బాబులకు టీడీపీ ప్రకాశం మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ శనివారం మొక్కలు అందజేశారు. పిపి లక్ష్మీ నారాయణ మాట్లడుతూ చెట్లు ప్రగతికి మెట్లు అని, కాలుష్య నివారణకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వర్షాలు సక్రమంగా పడాలంటే మొక్కలు నాటడం ఎంతో అవసరమన్నారు. హెూం జిపి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మొక్కల వలన ప్రకృతి సమతుల్యత లభిస్తుందని అన్నారు.

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి - వేమూరు

విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దుండగులు వైఎస్ఆర్ పేరు తొలగించడాన్ని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దావులూరి లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలవుతుందా లేదా రెడ్ బుక్కు రాజ్యాంగం అమలు అవుతుందాని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశ చరిత్రలో జగన్మోహన్‌రెడ్డి పేరు నిలిచిపోయే విధంగా విజయవాడ నడిబొడ్డున శృతివనం, 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ కౌతరపు పద్మావతి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి, ఇచ్చిన హామీలు మరచి విగ్రహాలు ధ్వంసం చేయడం, శిలాఫలకాలు కూల్చి వేయడంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి 164సీట్లు ఇచ్చారని విర్ర వీగు తున్నారని అన్నారు. 175కి 175వచ్చినా తమకేంటి అనుకుంటే అది చెల్లదని అన్నారు. రాజ్యాంగ నిబంధనలతో



నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు

నడుచుకోవాలని కోరారు. అంబేద్కర్ విగ్రహానికి ఉన్న పేరుల్ని తొలగించడం వెనక ఉన్న మర్మం ఏంటో తెలియాల్సి ఉందన్నారు. టిడిపి గతంలో అధికారంలో ఉన్నప్పుడు అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పి ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగం త్వరగా విచారణ చేసి దోషులను పట్టుకకుని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, నాయకులు కుక్కల భూషణరావు, కనపర్తి కోటేశ్వరావు, పెరికల శ్యామ్ సుందరరావు, గాడిల్లి దేవదాస్, కరీంశెట్టి బాలు, జల్లి జోషి కాంత్, జడ రవీంద్రబాబు, ఫణి, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి పత్రం అందజేస్తున్న ఎంఎల్ఎ తనయుడు

అంగన్‌వాడీ ఆయాకు టీచర్‌గా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - వేటపాలెం

అంగన్‌వాడి ఆయాగా పనిచేస్తున్న ఎస్ అంజలికి కార్యకర్తగా ఉద్యోగన్నతి కల్పిస్తూ శాసన సభ్యులు ఎంఎం కొండయ్య కుమారుడు మహేంద్ర నాథ్ చేతుల మీదుగా ఉత్తర్వులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తగా పదోన్నతి పొందిన అంజలి విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎసిడిపిఒ ఎం సుచిత్ర, అంగన్‌వాడి యూనియన్ నాయకురాలు ప్రమీల, బ్యూలా పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మాజీ సైనికులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ సైనికుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా వారి కుటుంబ సభ్యులకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ స్వచ్ఛంద వైద్య సహకారం అదిస్తుందని కిమ్స్ ఆస్పత్రి మేనేజర్ అమర్నాథ్ అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హెూంలో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి సహకారంతో మాజీ సైనిక ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కిమ్స్ హాస్పిటల్ ఈసిహెచ్ఎస్ కార్డు ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో 250మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. కళ్ళు, గుండె, ఎముకల సంబంధిత వ్యాధులకు వైద్యులు పరీక్షలు చేశారు. శిబిరంలో అశోక్ యాదవ్, రామాంజనేయులు, వెంకటరెడ్డి, అశోక్ కుమార్, మార్కెట్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ, జిల్లా మాజీ సైనికుల చైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - చీరాల

ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్న కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా పగలు, రాత్రి వేళల్లో త్రవ్వకాలు జరుపుతున్నారు. అక్రమంగా తరలింపుకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి రవాణా చేస్తున్నా ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. బైపాస్ రోడ్డులోని పాపాయిపాలెం రోడ్డు జంక్షన్‌లో రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు ఎలాంటి అనుమతులు లేకుండా జేసిబిలతో మట్టి త్రవ్వి ట్రాక్టర్ ద్వారా పాపాయిపాలెం దారిలోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు రవాణా చేస్తుంటాన్ని గమనించి అడ్డుకొని వివరాలు సేకరించారు. ఇసుక తరలింపుకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం తోలుకోవాలని సూచించారు. రవాణా ఖర్చులు, ఎత్తుడు కూలీలు మాత్రమే భరించాల్సి ఉంటుందని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టి రవాణాకు పాల్పడుతున్న వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

దేశం కోసం పోరాడిన వారిని గుర్తుంచుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

నేతాజీ సేవా సమితి సామాజిక సేవలు ప్రశంసనీయమని ఆదాయ పన్ను శాఖ అధికారి మురళి అన్నారు. పేరాల నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో చిన్న రథం సెంటర్లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద శనివారం ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సేవా సమితి ప్రతినిధులు సామాజిక సేవా దృక్పథంతో చేస్తున్న సేవలను అభినందించారు. నేతాజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. తొలుత బోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వతంత్ర్యం కోసం పోరాడిన అమర వీరుల త్యాగాలు భావి తరాలకు తెలియ చెప్పాలని అన్నారు. ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేయాలని అన్నారు. అనంతరం రిక్షా కార్మికులు, యాచకులు, పారిశుద్ధ్య



అల్పాహారం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

కార్మికులు వంద మందికి అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు చుండూరి కృష్ణమూర్తి, పవని భాను చంద్రమూర్తి, అబ్బు రమేష్, రామారావు, మణిబాబు, రవి కుమార్, చంద్రమౌళి, కొత్త వెంకటేశ్వర్లు, మహా నంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ పూర్వ అధ్యక్షులు హాజీ సయ్యద్ మౌలాలి పుట్టినరోజు సందర్భంగా స్థానిక రోటరీ కార్యాలయంలో మౌలాలి సౌజన్యంతో పేద మహిళ ఇడదాసరి ఉమాగౌరీకి కుట్టు మిషన్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడారు. పుట్టినరోజు సందర్భంగా అనవసరమైన ఆడంబరాలతో డబ్బు వృధా చేయకుండా ఒక పేద కుటుంబ పోషణకు అండగా నిలిచి మౌలాలి ఆదర్శంగా నిలిచారని అభినందించారు. మౌలాలి సామాన్య స్థితి నుండి ఉన్నత స్థాయికి ఎదిగినా కూడా వినమ్రంగా అందర్నీ గౌరవించే గొప్ప వ్యక్తని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి శ్రామిక రత్న అవార్డు అందుకున్న వ్యక్తని అన్నారు. అద్దంకిలో ఏ మంచి కార్యక్రమానికైనా సహాయమందించే మంచి మనిషని పేర్కొన్నారు. మిషన్ అందుకున్న ఉమాగౌరి మాట్లాడుతూ తనకు మిషన్ అందించి, తమ కుటుంబ ఉపాధికి తోడ్పడిన మౌలాలికి, రోటరీ సంస్థకు కృతజ్ఞతలు



పేద మహిళకు కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్‌రఫీ, చిన్ని మురళీకృష్ణ, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీ రామ చంద్రమూర్తి, పసుపులేటి ఆంజనేయులు, అళహరి హరి ప్రసాద్, సంకా సుబ్రహ్మణ్యం (బాబు), నర్రా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - వేటపాలెం

ఎన్నికల హామీ మేరకు మండలంలోని పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామానికి రోడ్డు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య తనయుడు మహేంద్ర నాథ్ తెలిపారు. మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం, రామాపురం తీరప్రాంతాన్ని డ్రైనేజీ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తీరం వెంట వచ్చే డబల్ రోడ్డును వేటపాలెం కొత్త కాలువ స్ట్రైట్ వరకు కొనసాగించాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డ్రైనేజీ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉమ్మడిగా ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్ర



మౌలిక వసతులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ తనయుడు

మంలో డ్రైనేజీ డిఇ ద్రాక్షారం వెంకట సుబ్బారావు, కంది అంజిరెడ్డి, అంజయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.



ఏల్చూరులో పేకాట జూదరులను పట్టుకున్న పోలీసులు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో పేకాట శిబిరంపై ఎస్ఐ పి సురేష్ తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు సీఐ కె వెంకటరావు సూచనతో 8మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రు.23220 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను సోమవారం అద్దంకి ఎంఎం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడే వారు, ప్రోత్సహించే వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.?

11న జనసేన అభినందన సభ

ప్రజాశక్తి - వేమూరు



జనసేన ఇన్‌చార్జి రాజేష్

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కార్యకర్తల శ్రేయస్సు కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదు ముగిసిందని జనసేన ఇన్‌చార్జి ఉషా రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుండి ఒక లక్షపైగా సభ్యత్వ నమోదు చేయడానికి తమ విలువైన సమయాన్ని కేటాయించి విజయవంతం కావడానికి కృషిచేసిన కార్యకర్తలు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు అత్యధికంగా చేయించిన వారిని అభినందించాలనే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చుండూరు మండలం పెనుగుదురుపాడు గ్రామంలో ఈనెల 11న ఆదివారం జరుగుతుందని తెలిపారు. జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, జిల్లా ప్రచర కమిటీ సభ్యులు శిఖా బాలకోటేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్, చాపల శివయ్య, కొల్లూరు, అమర్తలూరు, భట్టిప్రోలు అధ్యక్షులు బొందలపాటి చలమయ్య, రమేష్, యార్రంశెట్టి రవీంద్ర, చుండూరు ఉపాధ్యక్షులు నీలం రాము, మోదుకూరు, మండూరు, ఆలపాడు అధ్యక్షులు పోకాల శ్రీనివాసరావు, యశం జగదీష్, నాగం పవన్ కుమార్, వేమూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి దాసరి రంగా పాల్గొంటారని తెలిపారు.

ఎంపిడిఒ మాథ్యూబాబు బదిలీ

ప్రజాశక్తి - పంగులూరు



ఎంపిడిఒ మ్యాథ్యూ బాబు

ఎంపిడిఒగా ఇప్పటివరకు పనిచేసిన కె మాథ్యూబాబు బదిలీ అయ్యారు. ఆయనను గుంటూరు జిల్లాకు పంపారు. ఎన్నికల సమయంలో ఆయన గుంటూరు జిల్లా నుండి పంగులూరు ఎంపిడిఒగా వచ్చారు. ఐదు నెలల పాటు ఇక్కడ ఆయన పని చేశారు. ఆయన గుంటూరు జిల్లాకు బదిలీపై శనివారం వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త ఎంపిడిఒ రావాల్సి ఉంది. ఎన్నికలకు ముందు ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన రామాంజనేయులు ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. మరల బదిలీపై పంగులూరు మండలం వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది.

ఉపాధి వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో ఈ ఏడాదిగత మే నెల నుండి జూన్ నెల వరకు ఉపాధి హామీ కూలీలకు రావలసిన వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఉపాధి హామీ కూలీలు శనివారం డిమాండ్ చేశారు. మండలంలోని 20 గ్రామాల్లో పదివేల మంది వరకు ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్నారు. వీరికి రూ.4కోట్ల వరకు కూలి వేతనం చెల్లించవలసి ఉంది. కూలీలు వేతన బకాయి విడుదల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

ఎర్రజెండాను బలోపేతం చేద్దాం : మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామ స్థాయి నుండి ఎర్రజెండా బలోపేతం చేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. పట్టణంలో అంబేద్కర్ భవన్‌లో శనివారం జరిగిన సిపిఐ విస్తృత స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్ర జెండా పేదల తరుపున పోరాటం చేస్తుందని అన్నారు. ఎర్ర జెండా గొప్పతనాన్ని గ్రామ స్థాయిలో వివరించి విస్తరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని చెప్పారు. వ్యవసాయ కార్మిక, కర్షక, విధ్యార్థి, యువజన, మహిళా సంఘాలను బలోపేతం చేసి ప్రజా పోరాటాలే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం వాలంటీరు వ్యవస్థను తొలగించిందని, పేద ప్రజలకు చేరువై ఎర్రజెండా



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్

పట్టుకుని పనిచేయాలని చెప్పారు. వైసీపీకి ప్రజలు 151 సీట్లు ఇస్తే జగన్ రాజకీయ కక్ష, ద్వేషంతో చేజేతులా అధికారం కోల్పోయారని అన్నారు. చంద్రబాబు నాయుడు అమలుకు ఆచరణ సాధ్యం కానీ వాగ్దానాలు ఇచ్చారని అన్నారు. ఇచ్చిన హామీలు తప్పక నెరవేర్చాలని కోరారు. అమరావతి రాజధాని నిర్మాణానికి గతంలో మోడీ ఇచ్చిన నీళ్ళు, మట్టి కాకుండా నిధులు తీసుకురావాలని కోరారు. తొలుత మహమ్మద్ ముస్తఫా సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనిల్ కుమార్ అంజన్, సిపిఐ రాష్ట్ర ఇంచార్జ్ డిఎస్ రామచంద్రరావు మృతికి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధ్యక్షత వహించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జెబి శ్రీధర్, బత్తుల శామ్యూల్, తుమ్మల పుర్ణచంద్రశేఖర్, మల్లెల ఏసేబు, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, సైకం రాజశేఖర్, కెఎల్‌డి ప్రసాద్, నంబూరి సత్యం, కాలేషాగారి ఖాధర్‌బాషా, మేడా వెంకటరావు, మేకల రమణయ్య, వల్లెపు నరసింహం పాల్గొన్నారు.


పర్చూరులో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాలు

అంబేద్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా రాస్తారోకో

ప్రజాశక్తి - పర్చూరు

అంబేద్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా దళిత సంఘాల నాయకులు శనివారం బొమ్మల సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక బొమ్మల సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జై భీం అంటూ నినాదాలు చేశారు. దళితుల జోలికి వస్తే ఊరుకునేది లేదని దళిత నాయకులు హెచ్చరించారు. తమ ఆరాధ్య దైవం అంబేద్కర్ విగ్రహంపై దాడికి ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నాగులపాలెం దళితవాడలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు కూరాకుల ఇస్సాకు, గేరా స్వరాజ్ కుమార్, జూపూడి రోశయ్య, ఎడ్ల జయరాజు, కొట్టే ప్రభుదాసు, కూరకుల చెంచు, కాకి అశోక్, బిళ్ళా రాజేష్, విజయ్, మద్దిరాల సంతారావు, యెహోషువ, నల్లమోతు శ్యాం బాబు పాల్గొన్నారు.

చీరాలకు నలుగురు ఎస్ఐలు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని వన్ టౌను, టూ టౌన్ పోలీస్ స్టేషన్లో నలుగురు నూతన ఎస్ఐలను నియమిస్తూ ఎస్పీ తుషార్ డూడి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చీరాల ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెద్దుళ్ళపల్లిలో పనిచేస్తున్న బి అజిత, బాపట్ల 2వ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ఎస్‌కె అబ్దుల్ రజాక్ బదిలీ చేశారు. రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐలుగా జిల్లా విఆర్ నుండి ఎం శ్రీనివాసరావు, రోడ్డు సేఫ్టీ విభాగం నుండి వి నాగశ్రీను చీరాల టూ టౌన్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బదిలీ చేయబడిన నలుగురు ఎస్ఐలు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది.ద

రేణింగవరం ఎస్ఐగా వినోద్‌బాబు

ప్రజాశక్తి - పంగులూరు

రేణింగవరం ఎస్ఐగా బాలిన వినోద్ బాబును నియమిస్తూ ఎస్పీ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. విఆర్ నుండి వినోద్ బాబు రేణింగవరం ఎస్ఐగా నియమించారు. ఇప్పటివరకు ఎస్ఐగా పనిచేసిన కెకె తిరుపతిరావు బదిలీపై నిజాంపట్నం వెళుతున్నారు. శనివారం సాయంత్రం రిలీవ్ అవుతున్నట్లు తిరుపతిరావు తెలిపారు. వినోద్ బాబు ఒకటి రెండు రోజుల్లో ఎస్ఐగా బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది.

ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్‌గా 'ఊటుకూరి'

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లికి చెందిన ఊటుకూరి వెంకట నాగ ప్రసన్న కుమార్ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ విజయవాడ కేంద్రం కమాండెంట్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ విభాగం క్రింద ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నట్లు తెలిపారు. ఎక్కడైనా విపత్తులు జరిగినప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడటమే తమ ప్రధాన కర్తవ్యమని అన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్ విభాగంలో పనిచేయడం అనేది దైవ కృపగా భావిస్తున్నట్లు తెలిపారు. మానవులు, వన్య ప్రాణులను అన్నిటిని కాపాడటంలో ఎంతో సమన్వయం పాటిస్తూ, అందరిని సమీకృతం చేసుకుంటూ సౌమ్యతతో కాపాడటం అనేది తమ భాధ్యతని అన్నారు. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు కమాండెంట్‌గా చేసి నేడు మూడు రాష్ట్రాల పరిధిలోని విజయవాడ ప్రధాన కార్యాలయం కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ప్రసన్నకుమార్



ఎన్‌డిఆర్‌ఎఫ్ కమాండెంట్‌ను అభినందిస్తున్న దృశ్యం

సిఆర్‌పిఎఫ్‌లో ఎపి కమాండెంట్‌గా చేసి డిప్యుటేషన్‌పై ఢిల్లీలో ఎన్డీఆర్‌ఎఫ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేశారని తెలిపారు. జాతీయ విపత్తుల విభాగం ద్వారా ఇంకా ఎంతో సేవలు అందించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. పట్టభద్రుల సంఘం సహాయ కార్యదర్శి చుండూరి నాగాంజనేయులు, ఊటుకూరి శ్రీమన్నారాయణ, ఊటుకూరు సుబ్బారావు, మంచికంటి వెంకటేశ్వర్లు, క్రేన్ సత్యం తదితరులు కలిసి ప్రసన్నను అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పశువుల చావిడి దగ్ధం

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని అరవపల్లిలో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో తెనాలి సోమయ్య, తెనాలి వెంకట సుబ్బయ్యకు చెందిన పశువుల చావిడి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్నం అయ్యింది. బాధితుల వివరాల మేరకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు తెలిపారు. ప్రమాదంలో పశువుల చావిడి మొత్తం కాలిపోయింది. మంటల్లో ఒక పడ్డ దూడ మరణించగా మూడు చూడు గేదెలు తీవ్రంగా గాయాల పాయలైనట్లు తెలిపారు. చావిడిలో ఉన్న ట్రాక్టర్‌తో సహా కాలి బూడిదైనట్లు తెలిపారు. సుమారు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారం అందించి


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పశువుల చావిడి

ఆదుకోవాలని బాధితులు అధికారులను కోరారు. విషయం తెలుసుకున్న పశువైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని కాలిన గాయాలతో ఉన్న పశువులకు వైద్యం చేశారు.


కిరణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న గాదె వెంకటేశ్వరరావు

జనసేన సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి - వేమూరు

జనసేన క్రియాశీలక సభ్యత్వం 500పైగా నమోదు చేయించినందుకు మండలంలోని పెరవల్లి గ్రామ జనసేన అధ్యక్షుడు దాసరి కిరణ్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు చేతుల మీదుగా వేమూరు ఇన్‌ఛార్జి ఊసా రాజేష్ సమక్షంలో పెరవలిపాలెంలో జ్ఞాపికను శనివారం అందజేశారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి దాసరి రంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండురు గ్రామ అధ్యక్షులు యాసం జగదీష్ పాల్గొన్నారు.


పిడుగుపాటుకు మృతి చెందిన పొట్టేళ్లు

పిడుగుపాటుకు పొట్టేళ్లు మృతి

ప్రజాశక్తి - అద్దంకి

పిడుగుపాటుకు 8 పొట్టేళ్లు మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మణికేశ్వరం గ్రామ సమీపంలో పొట్టేళ్లు ఉన్న ప్రాంతంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. కొరిశపాడు మండలం అనమలమూరు గ్రామానికి చెందిన చెన్నుపాటి సుబ్బారావుకు చెందినవి దాదాపు రూ.లక్ష విలువైన పొట్టేళ్ల మృతితో నష్టపోనట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.


రోడ్డు ప్రమాదంలో మరణించిన సరికొండ నాగరాజు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పంగులూరు

జాతీయ రహదారిపై రోడ్డు దాటే సమయంలో అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించిన సంఘటన శనివారం సాయంత్రం బయట మంజులూరు జాతీయ రహదారిపై జరిగింది. గ్రామానికి చెందిన సరికొండ నాగరాజు (39) చిలకలూరిపేట వైపు నుంచి బస్సులో వచ్చి బయట మంజులూరు బస్‌స్టాపు వద్ద దిగాడు. బయట మంజులూరులోని తన ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో ఎపిఎస్‌ఆర్టీసీకి చెందిన ఇంద్ర బస్సు విజయవాడ నుండి ఒంగోలుకు వేగంగా వెళుతూ ఢీ కొట్టింది. బస్సు ఒక్కసారిగా ఢీ కొనడంతో నాగరాజు తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. అక్కడంతా రక్తమయమైంది. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న గ్రామస్తులు పరుగున వచ్చారు. మృతి చెందిన నాగరాజు టాపీ పని, లారీల్లో సహాయకునిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య శివ పార్వతి, తల్లి చిన్న ఆదెమ్మ ఉన్నారు. భర్తను కోల్పోయిన శివ పార్వతి, కుమారుడ్ని కోల్పోయి ఆదెమ్మ బోరున విలపిస్తున్నారు.


చోరీకి గురైన ట్రాక్టర్ ట్రాలీ

చోరీలతో హడలెత్తిపోతున్న జనం

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల చోరీలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు కలవకూర్ రోడ్డు ప్రాంతంలోని ఇటుక బట్టీల వద్ద దర్జాగా ఒక ఆటోను వేసుకుని తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నట్లు ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. బట్టీల ప్రాంతంలో ఏ వస్తువు దొరికితే వాటిని ఆటోలో తరలించకపోతున్న ఘటనలు జరుగుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఈ చోరీలు జరుగుతున్నాయి. ఇటుక బట్టి యజమానులు పోలీసులకు సమాచారం అందించినప్పటికీ రికవరీ చేసిన దాఖలాలు లేవని ఇటుకల బట్టి యజమానులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. దోప్పలపూడి ప్రసాద్ ఇటుకల బట్టి వద్ద రెండు బ్యాటరీలతో పాటు, ట్రాక్టర్ ట్రాలీని కూడా అపహరించుకెళ్లినట్లు సోషల్ మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు కూడా దొప్పల పూడి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. వారం రోజులు క్రితం కోనేటి శ్రీనివాసరావు ఇటుక బట్టీల వద్ద పది కుర్చీలతో పాటుగా మూడు రూముల తాళాలు పగలగొట్టి లోపల వస్తువులను చిందరవందర చేశారు. దగ్గరలోని మరో బట్టి వద్ద ఇటుకొలకు ఉపయోగించే ప్లాస్టిక్ పట్టలు, ట్రాలీ బల్లలు, తలుపులు తరలించుకొని వెళ్లారని బాధితులు తెలిపారు. వరుస ఘటనలు జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోక పోవడం ఏమిటని ఇటుక బట్టి యజమానులు ప్రశ్నిస్తున్నారు.


బ్యాటరీలు తీసుకువెళ్లిన దృశ్యం

రాజకీయ వ్యూహాలు

పాలన మారగానే పాలకపక్షం రాజకీయంగా పట్టు సాధించే వ్యూహాలపై కేంద్రీకరించడం సహజం. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తోన్న తెలుగుదేశం కూడా ఇదే పంథాలో ఉంది. అధికారం రాగానే ప్రతిపక్షాన్ని పలుచన చేయాలనే ఆలోచనే ముందుగా ఉంటుంది. ఇప్పుడూ అదే ముందుకు వచ్చింది. పాలకపక్షం ఇప్పుడు ఒంగోలు నగర కార్పొరేషన్‌ను కైవశం చేసుకునే వ్యూహం అమలుచేస్తోంది. వైసిపి ఆధీనంలో ఉన్న కార్పొరేషన్‌ను పార్టీ ఫిరాయింపుల ద్వారా చేజిక్కించుకునే వ్యూహం దాదాపుగా సఫలమైందనే చెప్పాలి. అందుకు ఎమ్మెల్యే దామచర్ల పక్కా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే చాలా మంది వైసిపి కార్పొరేటర్లు తెలుగుదేశం వైపు చేరారు. మేయర్ కూడా చేరేందుకు సిద్ధమైందన్న చర్చ సాగుతోంది. వ్యూహాత్మకంగానే కార్పొరేషన్‌ను చేజిక్కించుకుంటే అక్కడ నుంచే అభివృద్ధి పనులపై పెత్తనంతో పాటు పూర్తి తమ ఆధీనంలో నడుస్తాయనే భావన తెలుగుదేశం పార్టీ నేతల్లో ఉంది. దీన్ని సాకారం చేసేందుకు రంగం సిద్ధమైంది. కీలకమైన వైసిపి సభ్యులు కూడా చేరిపోతున్నారు. పైగా ఇక్కడ ప్రతిపక్షం నుంచి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా రాజకీయంగా గందరగోళంగా ఉన్నారు. దీంతో ఆయన్ను నమ్ముకున్న నేతలు కూడా జారిపోతున్నారు. ఓటమి తర్వాత వైసిపిలో ఉన్న పరిస్థితి ఏమిటో స్పష్టంగా ఉంది. పార్టీ క్యాడర్‌ను నిలబెట్టే యత్నాలు కూడా నేతలు చేయడం లేదు. మొక్కుబడిగానే నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. ప్రతిపక్షాన్ని వీలైనంత బలహీనం చేసే దిశగా పాలకపక్షం పావులు కదుపుతోంది.



యంత్రాంగంలో మార్పులు కొనసాగుతున్నాయి. కలెక్టర్, ఎస్పీ బదిలీల తర్వాత తహశీల్దార్లు, సిఐల బదిలీలు జరుగుతున్నాయి. ఇంకా జిల్లా అధికారుల మార్పులు చేపట్టలేదు. రేపోమాపో అంటున్నారే తప్ప చర్యలు మాత్రం కనిపించడం లేదు. దీంతో పాలన ఇంకా ఆశించిన స్థాయిలో వేగంగా లేదనే చర్చ ఉంది. జిల్లా అధికారులు అందరూ బదిలీల ఆలోచనలోనే ఉన్నారు. కీలకమైన పనులు చేయడానికి సిద్దంగా కనిపించడం లేదు. మొక్కుబడిగానే ఉన్నారు. ఎవరుంటారో.. ఎవరిని పంపుతారో కూడా స్పష్టత లేదు. కొన్ని శాఖల్లో రెండు, మూడు నెలల్లో రిటైర్ అయ్యే అధికారులున్నారు. వాళ్ల పరిస్థితి కూడా సందిగ్ధంగానే ఉంది. ఈ రెండు నెలలూ కొనసాగించాలని నేతలు చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి వారిపైనా స్పష్టత లేదు. దీంతో జిల్లా అధికారులు అందరూ బదిలీపైనే దృష్టి సారించారు. పాలనపై శ్రద్ధ తగ్గింది.

అధికారం మారాక చిరుద్యోగుల మెడపై పాలకపక్ష నేతలు కత్తి పెట్టారు. కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారిని తీసేసి కొత్తగా పార్టీ కార్యకర్తలను పెడుతున్నారు. గ్రామాల్లో ఇదొక అలజడిగా మారింది. విఓఏలు, మధ్యాహ్నం భోజనం కార్మికులు, డీలర్లు, మున్సిపల్ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ స్కీముల కింద పనిచేసేవాళ్లను బలవంతంగా తప్పిస్తున్నారు. గ్రామాల్లో తెలుగుదేశం నేతలు చెప్పిందే వేదంగా భావించి ఎమ్మెల్యేలు అందుకు అవసరమైన ప్రక్రియను నడుపుతున్నారు. వాళ్లంతా ఇప్పుడు రోడ్డున పడుతున్నారు. వైసిపి హయాంలో పెట్టిన వారినే కాకుండా పదేళ్లకు పైగా ఉన్నవారిని కూడా తీసేస్తున్నారు. వీళ్లంతా పాలకపక్ష నేతల చుట్టూ తిరుగుతున్నారు. డీలర్లు అందరూ పార్టీలపరంగానే ఉంటారు. ఈ తొలగింపులపై రాజకీయంగానే చర్చ ఉంటుందే తప్ప ఉపాధిగా చూసే పరిస్థితి లేదు. అయితే మిగతా స్కీమ్‌వర్కర్లు రాజకీయాలతో ముడిపడి లేరు. వారంతా చాలాకాలంగా పనిచేస్తున్నారు. కొద్దిపాటి ఆదాయాలతోనే కాలం గడుపుతున్నారు. ఇప్పుడు వారిని తీసేస్తున్నారు. వాళ్లంతా రోడ్డున పడ్డారు. ఇప్పటికైనా తెలుగుదేశం నేతలు చిరుద్యోగులపై సానుకూలంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

జలాశయాలు నిండటంతో సాగర్ ఆయకట్టులో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం, సాగర్ రెండూ నిండాయి. గేట్లు కూడా ఎత్తేశారు. భారీగా వరద నీరు వస్తోంది. ప్రస్తుతం కాలువలకు కూడా నీటిని విడుదల చేశారు. ఈ నీటితో చెరువులు నింపాలి. తాగునీటి పథకాల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులను నింపాలి. అందుకు సమగ్ర ప్రణాళికలూ కనిపించడం లేదు. సాగుపైనా రైతులకు స్పష్టత ఇవ్వాలి. రెండేళ్లు నీళ్లులేక మాగాణి పండలేదు. ఆరుతడి పంటలకు కూడా నీరు లేదు. గత రబీలో కరువు వల్ల పంటలన్నీ పోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది నీరున్నందున సాగర్ ఆయకట్టులో పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలి. ఇరిగేషన్, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పంటల సాగు, నీటి సరఫరాపై దృష్టి సారించాల్సి ఉంది.

చేనేత దినోత్సవం, గిరిజన దినోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. చీరాలలో సిఎం చంద్రబాబు పాల్గొనాల్సి ఉండగా వర్షం కారణంగా ఆయన రాలేకపోయారు. మంత్రి సబిత హాజరయ్యారు. చీరాలలో చేనేతపార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వాస్తవానికి చేనేతకేంద్రంగా ఉన్న చీరాల నుంచి గెలిచిన కొణిజేటి రోశయ్య ముఖ్యమంత్రి కూడా అయ్యారు. అంతకుముందు ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఎవరూ ఇక్కడ చేనేతల అభివృద్ధికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఫలితంగా చేనేత కార్మికుల బతుకులు నానాటికీ దుర్భరమవుతున్నాయే తప్ప మెరుగుపడటం లేదు. ఈ ప్రభుత్వమైనా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని ఆశిద్దాం..


ఘనంగా 'శిద్దా' జన్మదిన వేడుకలు

- పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ - భారీ సంఖ్యలో అభిమానులు రాక

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం స్థానిక హరిహరక్షేత్రంలో గోల్డెన్ గ్రానైట్స్ జనరల్ మేనేజర్ ఏ.గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానుల మధ్య శిద్దా రాఘవరావు దంపతులు ఏపి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు శిద్దా సుధీర్‌కుమార్‌తో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు దుస్తులు అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పదోతరగతి విద్యార్థికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. పేద ఫోటోగ్రాఫర్ సుబ్బయ్యకు టీవీని బహూకరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. స్థానిక వివిధ పత్రికలలో పనిచేస్తున్న 20 మంది పేపర్‌బాయ్స్‌కు దుస్తులు అందజేశారు. భారీగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు శిద్దా రాఘవరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రముఖ గ్రానైట్ వ్యాపారులు మండవ శ్రీనివాసరావు, జడ్‌ఎంఈ శ్రీకృష్ణ, నల్లూరి సత్యనారాయణ, మండవ ట్రాన్స్‌పోర్ట్సు మండవ గోపి, మండవ శ్రీనివాసరావు, టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాద్, జి.రాఘవరావు, జడ్‌పిటిసి వేమా శ్రీను, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు శిద్దా పాండురంగారావు, చలువాది బదరీ నారాయణ, శిద్దా ఆంజనేయప్రసాద్, శిద్దా పవన్‌కుమార్, శిద్దా కాశీ, శిద్దా సురేష్, శిద్దా సుధాకర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.జవహర్, బి.కిరణ్ కుమార్, జి.శ్రీహరి, సిహెచ్. హనుమంతరావు, నూకల సురేంద్ర, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు రావూరి కాశీరంగ జనార్ధనరావు, కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణారావు, కోశాధికారి శ్రీరంగనాయకులు, వాసవీ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్ పెనుగొండ శ్రీనివాసరావు ఉన్నారు. వివిధ మండలాల ఆర్యవైశ్య బాధ్యులు భారీ సంఖ్యలో పాల్గొని శిద్దాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిద్దా రాఘవరావు మనుమడు మన్యం విహాన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిద్దా రాఘవరావు కుమార్తె అల్లుడు మన్యం సునీత, మన్యం ఫణికుమార్, జ్యోతి ఎక్స్‌పోర్ట్సు సిఈఓ శివరామ్, దర్శి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలల నుంచి భారీ సంఖ్యలో ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవీ మహిళలు పాల్గొన్నారు.


కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న శిద్దా రాఘవరావు


బధిర విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

డిసెంబర్‌లో యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు

- రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యుటిఎఫ్ ఆవిర్భ వించి 50 ఏళ్లు నిండిన సందర్భంగా రాష్ట్ర స్వర్ణోత్స వాలు డిసెంబర్‌లో కాకినాడ నగరంలో జరుగుతాయని రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మొ జు శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జెండాను రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావు ఆవిష్కరించి మాట్లాడుతూ యుటిఎఫ్ 1974 ఆగస్టు 8న ఆవిర్భవించిందని, రాష్ట్ర స్వర్ణోత్సవాలు డిసెంబర్‌లో కాకినాడ నగరంలో 25 వేల మందితో జరుగుతాయన్నారు. ప్రతి మండలంలో స్వర్ణోత్సవాలు జరిపి యుటిఎఫ్ ఆవశ్యకతను ఉపాధ్యాయులు, ప్రజానీకానికి తెలియజేయాలన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ యుటిఎఫ్ బలోపేతానికి ఎంతో మంది నాయకులు త్యాగాలు చేశారన్నారు. ఈ 50 సంవత్సరాల ఉద్యమం కోసం పనిచేసిన ప్రతి యుటిఎఫ్ నాయకుడిని గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్న స్వామి, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వర్లు, బాలరాజు, ఒంగోలు ప్రాంత యుటిఎఫ్ కార్యకర్తలు 100 మంది పాల్గొన్నారు.